క్లుప్తంగా

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: 11కేవీ టౌన్ -3ఫీడర్ పరిధిలో జూన్ మాసంలో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో వెలుగులోకి వచ్చిన శిథిలావస్థకు చేరిన స్తంభాలు మార్పు, చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిరోడ్డు, ఈదమ్మ గుడి, తెలంగాణ చౌరస్తా, బీడీ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భారీ వర్షం



అలంపూర్: నియోజకవర్గంలో విస్తారంగా వర్షం కురిసింది. నియోజకవర్గంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, బైరాపురం, తక్కశిల, ప్రాగటూరు, గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం 7 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని అనసూయమ్మ కాలనీకి వెళ్లే వాగు రోడ్డు ఎక్కిపారడంతో రాకపోకలు స్తంభించాయి. వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

అయిజ: తేలికపాటి వర్షాలకు కూడా పట్టణంలోని కొన్ని కాలనీలు నీటిలో మునిగిపోతున్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణంలోని పాత బస్టాండ్, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు చెరువులను తలపించాయి. మున్సిపాలిటీలోని 12వ వార్డు నీటిలో మునిగి పోయింది. డ్రెయినేజీలు నిర్మించేందుకు పాలకులు, అధికారులు కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ధరూరు: మండలంలో సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు దాదాపు గంటపాటు భారీ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాడుపట్టిన మెట్ట పంటలకు జీవం పోసినట్లైంది.

వరల్డ్ తైక్వాండో మాస్టర్స్ యూనియన్ కోర్సు ఎంపిక

గద్వాల: ఈ నెల 21 నుంచి 26 వరకు జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ కోర్సుకు గద్వాలకు చెందిన తైక్వాండో మాస్టర్లు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీహరితో పాటు కోచ్‌లు రామేశ్వరి, సుధీర్‌కుమార్ ఎంపికయ్యారు.

తైక్వాండో మాస్టర్‌కు సత్కారం



అయిజ: అయిజ పట్టణంలో ఉంటున్న సుధీర్ కుమార్ ఈనెల 20 నుంచి 26 వరకు జార్ఖండ్ రాంచీలో నిర్వహించనున్న తైక్వాండో ఈ గ్రాండ్ మాస్టర్ కోచింగ్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి సుధీర్ కుమార్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. మండల కేంద్రంలో 23 సంవత్సరాలుగా విద్యార్థులకు తైక్వాండో శిక్షణ ఇస్తూ వివిధ జిల్లాలు, రాష్ట్రాల స్థాయిలో మెడల్స్ సాధించినట్లు తెలిపారు. జార్ఖండ్ రాంచీలో నిర్వహించనున్న శిక్షణకు రాష్ట్రం మొత్తంలో 8 మంది ఎంపికైతే వారిలో సుధీర్ కుమార్ ఉండడం గర్వకారణమన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికి రుణమాఫీ

గద్వాల రూరల్: జిల్లా రైతాంగం 2018 డిసెంబర్ నుంచి 2023డిసెంబర్ మధ్యలో షార్ట్‌టర్మ్ పంట రుణాలు తీసుకున్న వారికి ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేస్తుందని, అర్హులైన రైతులకి రుణమాఫీ కానీ పక్షంలో సంబంధిత వ్యవసాయ అధికారులతో సంప్రదించి వివరాలను ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవిందు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరును ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి, అవసరమైన పత్రాలతో సమర్పించాలని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదించాలన్నారు.

ఇంజినీర్‌కు శుభాకాంక్షలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎస్ లక్ష్మీనారాయణ విద్యుత్‌శాఖలో హైదరాబాద్‌లో డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. సాంతూరులో విద్యుత్ సమస్య ఉందని కరెంట్ స్తంభాలు, తీగలు, సామగ్రి కావాలని విన్నవించగా, ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్య పరిష్కరించారు. డీఈ నుంచి ఎస్ఈగా ప్రమోషన్ పొందిన లక్ష్మీనారాయణకు గ్రామస్తులు హైదరాబాద్‌కు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.



ధరూరులోని పాఠశాలలో రాఖీలు కడుతున్న చిన్నారులు



గద్వాలలో రాఖీ పౌర్ణమి వేడుకల్లో పద్మశాలి సంఘం నాయకులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి రాఖీ కడుతున్న చెల్లెలు

ఘనంగా రక్షాబంధన్

అలంపూర్: నియోజకవర్గంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకోని రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెల్ల అత్మీయ అనుబంధాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి వేడుకలను కనుల పండువగా చేశారు. రాఖీ పండు సందర్భంగా ఆలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిశాయి. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో విద్యార్థులు సామూహికంగా కూర్చొని తోటి విద్యార్థులకు విద్యార్థినీలు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. పాఠశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డికి ఉపాధ్యాయులు రాఖీ కట్టి వేడుకలు చేశారు.

కేటీదొడ్డి: రక్షాబంధన్ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. సోదరులు కానుకలు సమర్పించి ఆశీర్వాదం పొందారు.

ధరూరు: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షా బంధన్ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి అక్కా,చెల్లెలు తరలి వచ్చి అన్న, తమ్ముళ్లకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు.

శాంతినగర్: రాఖీ పౌర్ణమి వేడుకలు వడ్డేపల్లి పరిధిలో, మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి పుట్టినింటికి వచ్చిన ఆడపడుచులు వారి అన్నలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సోదరీమనుల రాకతో ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.



అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో రాఖీ పండక వేడుకల్లో విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో రక్షా బంధన్ ఘనంగా నిర్వహించారు. అక్కలు తమ్ముళ్లకు, చెల్లెల్లు అన్నయ్యలకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు.

రాజోళి: రాఖీ పౌర్ణమిని మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులకు కానుకలు అందించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కొందరు ఆలయానికి వెళ్లి ఆలయంలో దేవుడి ముందు రాఖీ కట్టారు.

మల్దకల్: మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా వృద్ధ వయస్సు వారు కూడా తమ సోదరులకు రాఖీలు కట్టి సోదరభావం చాటుకున్నారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

గద్వాల: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయస్వామి ఆలయంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటల పూజలు చేపట్టారు. అనంతరం హాజరైన ప్రతి ఒక్కరికీ రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా తమ్ముళ్లు అక్కా చెల్లెళ్లకు జీవితాంతం రక్షణగా ఉండేలా రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు.

మాంటిస్సోరిలో వేడుకలు

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో రాఖీ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి మాట్లాడారు. వేడుకల్లో పాల్గొన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ కేఎస్‌పీ రవిప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు.



రాజోళిలో ఆలయంలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



మల్దకల్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



అమరవాయిలో సోదరులకు రాఖీ కడుతున్న అక్క



ఎర్రవల్లిలో తమ్మునికి రాఖీ కడుతున్న అక్క



అయిజలో సోదరులకు రాఖీ కడుతున్న సోదరి



అలంపూర్ మాంటిస్సోరిలో రాఖీ కడుతున్న విద్యార్థులు



కొండాపురంలో..

కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

సాక్షి ఎఫెక్ట్..

అయిజ: మండల కేంద్రంలో పాత బస్టాండ్-కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు కొన్నిరోజులుగా నిలిచిపోయాయి. 'నిలిచిన అప్రోచ్ రోడ్డు పనులు' అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌పై వత్తిడితెచ్చి నిలిచిన అప్రోచ్ రోడ్డు పనులు కొనసాగేలా చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు 'సాక్షి'ని అభినందించారు.



తిరిగి ప్రారంభమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు

రైతువేదిక ఎదుట నిరసన

అయిజ: మండల కేద్రంలోని రైతువేదిక ముందు మండలంలోని వివిధ గ్రామాల రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, సగంమంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని మండి పడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది కొండత, చేసింది గోరంత అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేయకుంటే రైతుల తరుపున నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అయిజలో రైతువేదిక ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు

వీరభద్రేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం

గట్టు: మండలంలోని నూతనంగా నిర్మించిన వీరభద్రేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వీరభద్ర శివాచార్య, పంచాక్షరి శివాచార్య స్వాములు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు నాయకులకు శాలువాతో సన్మానించారు. నాయకులు జంబురామన్‌గౌడు, గద్దం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, బస్వరాజ్, రామునాయుడు, రాజు నాయుడు, వీరేష్‌గౌడు, కిష్టప్ప ఉన్నారు.



నూతన ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కుంగ్‌ఫూలో రాణించాలి

గద్వాల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణకు కుంగ్‌ఫూలో సైతం రాణించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 35వ నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో జిల్లా కేంద్రంలోని డ్రాగన్ షోటోకాన్ కరాటే స్పోర్ట్స్ నుంచి మాస్టర్ ఆర్పుత్ ఆధ్వర్యంలో 22మంది విద్యార్థులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో మొదటిస్థానంలో 13మంది, ద్వితీయ స్థానంలో నలుగురు, మూడో స్థానంలో ఐ దుగురు విద్యార్థులు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజ యం సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వెంకటేష్ ఉన్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి ఫ్యాన్స్

రాజోళి: ఈనెల 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ మొక్కలు నాటారు. కోటవీధితో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, వాటి ప్రాధాన్యత వివరించారు. మంగళవారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి చిరంజీవి అభిమానులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య, మాజీ జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు నిషాక్, వీరేష్,సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతుల ఫిర్యాదులు స్వీకరిస్తాం

శాంతినగర్: మూడు విడతల్లో రుణాలు మాఫీ కాని అర్హులైన రైతులకు సంబంధించిన ఫిర్యాదులు మంగళవారం నుంచి స్వీకరిస్తామని ఏఓ రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నంబర్లలో తప్పులున్న ఖాతాలు, పాస్‌బుక్ నంబర్లు లేనివి, బ్యాంకుఖాతా పేరు, ఆధార్‌ఖాతా పేరు తప్పుగా ఉన్న ఖాతాల రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రెండు లక్షలకు పైబడి రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆదేశాలు వెలువడుతాయని, రైతులు వేచి చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు న్యాయం చేసేందుకు మంగళవారం నుంచి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్12, 2018 నుంచి డిసెంబర్9, 2023 లోపు రుణం పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, జీఓ నంబర్ 567 ప్రకారం రైతులకు రుణమాఫీ అందుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఏఓ సూచించారు.

నిబంధనల మేరకు పనిచేస్తా

అయిజ: రైతులకు సేవలందించడంలో ప్రభుత్వ నిబంధనల మేరకు నిబద్ధతతో పనిచేస్తానని మండల వ్యవసాయ అధికారి కె.జనార్దన్ అన్నారు. ఇంతకాలం మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన శంకర్‌లాల్ చేవెళ్లకు బదిలీ అయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారిగా పనిచేసిన జనార్దన్ అయిజకు బదిలీ అయ్యారు. మండల వ్యవసాయ అధికారిగా జనార్దన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులకు రుణమాఫీ నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఏఈఓకు ఘన సన్మానం

ధరూరు: మండలంలోని నీలహళ్లి క్లస్టర్‌లో ఏఈఓగా పని చేస్తున్న నర్సింహులును గ్రామ రైతులు ఘనంగా సన్మానించారు. నర్వకు బదిలీపై వెళ్తున్న ఏఈఓను గ్రామంలోని రైతు వే దికలో శాలువా, పూలమాలతో సత్కరించారు. తనను ఓ అధికారిగా కాకుండా ఇంటి సభ్యు నిలా చూసుకున్న గ్రామస్తులకు రుణపడి ఉంటానని ఏఈఓ నర్సింహులు అన్నారు.

మండల వ్యవసాయ అధికారిణిగా అనిత

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సురేఖ బదిలీపై వెళ్లింది. ఆమె స్థానంలో అలంపూర్‌లో విధులు నిర్వహిస్తున్న అనిత ఉండవెల్లికి బదిలీపై వచ్చారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అయిజ: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజు ఆనవాయితీగా నిర్వహించే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. స్వామివారి కల్యాణానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామివారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భద్రావతి-భావన మహర్షిల కల్యాణం

రాజోళి: మండల కేంద్రంలో భద్రావతి-భావన మహర్షిల కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. భక్త మార్కండేయ ఆలయంలో, పద్మశాలి కులస్తులు బిందె సేవ, నందికోల సేవలతో పాటు విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అర్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాత్రి ప్రభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: జూరాల ప్రాజెక్టు కాల్వల్లో పూడికను తీయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకం అమలు చేయాలని, క్రాస్ డ్రాఫ్టల నీరు లీకేజీ అరికట్టాలని, తదితర రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సత్యారెడ్డి, రాజన్న, కృష్ణన్న తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గోపాల్

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



డాగూరే లూయిస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

ధరూరు: ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో డాగూరే లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించేది, కాలగర్భంలో కలిసి చరిత్రను సజీవంగా నిలిపేదే ఫొటోగ్రఫి అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్, మండల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషర్ కార్యదర్శి శ్యామ్, ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా మీడియా ఇన్‌ఛార్జి గోవిందు, రాజు, వెంకటేష్, జయరాం, రవి, సురేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో డాగూరే లూయిస్ చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అలంపూర్ ఫొటో, వీడియో అసోషియేషన్ అధ్యక్షుడు కొంకల రామకృష్ణ, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు శాంతిరాజు, అంజి, చంద్ర, రాజ్‌కమల్, జాన్, రవి, ఒకే ఒక్కడు, రషీద్, రాజుగౌడ్, శివ, మున్నా తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని కొవ్వొత్తుల ర్యాలీ



ఎర్రవల్లిచౌరస్తా: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం రాత్రి యువత ఆధ్వర్యంలో ఎర్రవల్లి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి కూడలిలో వైద్య విద్యార్థిని మౌనిక దెబ్నాత్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించి మృతురాలి కుటుంబానికి ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

మద్యంమత్తులో వాహనదారుడు హల్‌చల్

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో సోమవారం సాయంత్రం గద్వాల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో మద్యంతాగి బైక్ నడుపుతున్న వాహనదారుడును బ్రీత్ అన్‌లైజర్‌తో టెస్ట్ చేయగా మద్యంతాగినట్లు వెల్లడైంది. దీంతో వాహనదారుడు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడడం, స్థానికులు పెద్ద ఎత్తున్న గుమికూడారు. ఆటు నుంచి వెళ్తున్న ఓ రిపోర్టర్ ఈ దృశ్యాన్ని ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, పోలీసులు అడ్డుకొని సెల్‌ఫోన్‌ను బలవంతగా లాక్కున్నారు. తర్వాత ఫోన్ తిరిగిచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులుగా భావించి ఫోన్ తీసుకున్నట్లు ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడు పేర్కొన్నారు. మరోవైపు మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని కంట్రోల్ చేసే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. హల్‌చల్ చేసిన వ్యక్తిని ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రావణ రెండో సోమవారం పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శివాలయాన్ని దర్శించుకున్నారు.

హనుమాన్ చాలీసా

బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆకుపూజ, అభిషేకం చేశారు. వికాస తరంగిని ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆలయంలో 41సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ సిబ్బంది, అర్చకులు, వివిధ గ్రామాల బీహెచ్‌పీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

అయిజ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు లేకపోవడంలో ఆస్పత్రికి వస్తున్న రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వసతులు కల్పించాలని అఖిపక్ష కమిటీ ప్రెసిడెంట్ ఆంజనేయులు అన్నారు. సోమవారం అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి ముందు నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆస్పత్రిలో నలుగురు స్టాఫ్ నర్సులు ఉండాలన్నారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నెట్టంపాడు నీళ్లు రోడ్డు పాలు



అయిజ: నెట్టంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా మల్దకల్ మండలంలో నిర్మించిన నాగర్దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీళ్లు సోమవారం అయిజ శివారులో రోడ్డుపై పారుతున్నాయి. ప్రాజెక్ట్‌లో భాగంగ కాల్వలు పూర్తి చేయకపోవడం, కంపచెట్లు, గడ్డి పెరిగి కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డుగా మారడంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వదిలిన నీళ్లు రోడ్డుపై పారి పంటపొలాలను ముంచెత్తుతున్నాయి. దానివల్ల సాగు చేసిన పంటపొలాలకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాల్వ పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

అలంపూర్ రూరల్: అలంపూర్ నుంచి ర్యాలంపాడ్‌కు వెళ్లే తుంగభద్ర నది బ్రిడ్జిపై బైక్ అ దుపు తప్పి కింద పడి వ్యక్తికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. సుల్తాన్‌పూర్‌కు చెందిన రవిసాగర్ అలంపూర్ నుంచి సుల్తాన్‌పూర్‌కు వెళ్తున్న క్రమంలో బ్రిడ్జిపై బైక్ అదుపు తప్పి కింది పడి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అలంపూర్ ఆస్పత్రికి తరలించారు.